బ్రాహ్మణ సమ్మేళనం విజయవంతం చేయాలి

టీబీఎస్ఎస్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు

నల్లకుంట: బ్రాహ్మణ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ సంఘం(బీఏపీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించే బ్రాహ్మణ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని బ్రాహ్మణ సంఘాలు ఏకీకృతం కావాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పిలుపునిచ్చారు. బ్రాహ్మణ విద్యార్థులకు చెల్లించాల్సిన రెండో విడత ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి పేద బ్రాహ్మణ విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే ఎన్నికల్లో బ్రాహ్మణులకు జనాభా దామాషా ప్రకారం తమ వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. బ్రాహ్మణ సమ్మేళనంలో బ్రాహ్మణ సంఘం భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళికను రూపొందించనుందని ఆయన పేర్కొన్నారు.

ముషీరాబాద్‌లో యథావిధిగా తాగునీటి సరఫరా

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని దాయారం మార్కెట్ చౌరస్తా నుంచి సాగర్‌లాల్ ఆస్పత్రి వరకు నిర్మిస్తున్న 1000 ఎంఎం తాగునీటి పైపులైన్ నిర్మాణ పనుల కారణంగా శుక్రవారం సాయంత్రం మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. శనివారం యథావిధిగా తాగునీటి సరఫరా చేస్తామని రిజర్వాయర్ డీజీఎం మోహన్‌రాజ్, సెక్షన్ మేనేజర్ సురేష్ తెలిపారు. త్వరితగతిన పైప్‌లైన నిర్మాణ పనులు పూర్తి చేసి మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి

అంబర్‌పేట: అంబర్‌పేట డివిజన్‌లో ఆలయాల అభివృద్ధికి తనవంతు తోడ్పాటును అందిస్తానని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం అంబర్‌పేట ప్రధాన రోడ్‌లో ఉన్న ముత్యాలమ్మ నల్లపోచమ్మ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 2025 సంవత్సరం కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చొరువ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నాగా శంకర్, పెంట యాదగిరి, నర్సింగ్‌రావు, నర్సయ్య, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కాచిగూడ: తెలంగాణ మున్సిపల్ స్వీపర్స్ అండ్ కామాటి వెల్ఫేర్ సొసైటీ అంబర్‌పేట నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా ముత్యపాక సత్యనారాయణను నియమిస్తూ గురువారం సొసైటీ అధ్యక్షుడు గాలిపల్లి కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.ఇందిర నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ స్వీపర్స్, కామాటిలకు అండగా ఉంటామన్నారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించే విధంగా చూడాలని సూచించారు. సమస్యలను అధికారుల దృష్టికి పరిష్కరించాలని అన్నారు.

అనుకరణ కళలో దిగ్గజం నేరెళ్ల వేణుమాధవ్

చిక్కడపల్లి: అనుకరణ కళను శాస్త్రబద్ధం చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన నేరెళ్ల వేణుమాధవ్ అనుకరణలో దిగ్గజమని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం త్యాగరాయ గానసభలో విఖ్యాత మిమిక్రీ కళాకారుడు డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ యాదిలో.. సంస్మరణ సమావేశం జరిగింది. దేవి ప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డపై పుట్టిన ఎందరో ప్రతిభావంతులలో నేరెళ్ల వేణుమాధవ్ ప్రముఖులని అన్నారు. ఐక్యరాజ్య సమితిలో మిమిక్రీ కళను ప్రదర్శించి దేశ ఖ్యాతిని నిలిపిన వేణుమాధవ్ నాటి ప్రముఖులు నెహ్రూ, రాధాకృష్ణన్, ఇందిరా గాంధీ వంటి వారి సమక్షంలో తన ప్రతిభను ప్రదర్శించి అభినందనలు అందుకున్నారని గుర్తు చేశారు. మిమిక్రీ కళాకారిణి ఉదయశ్రీ మాట్లాడుతూ.. వేణుమాధవ్ ఎందరికో శిక్షణ ఇచ్చి కళాకారులుగా తీర్చిదిద్దారని అన్నారు. ఆయన వల్ల ఉపాధి అవకాశాలు కళాకారులకి లభించిందన్నారు.

పరిమిత ఆహారం తీసుకుంటే ఒత్తిడిని జయించవచ్చు

చిక్కడపల్లి: పరిమిత ఆహారం తీసుకుంటే మానసిక ఒత్తిడిని జయించవచ్చునని వక్తలు పేర్కొన్నారు. చోడేశ్వర నాట్య కళామండలి నిర్వహణలో శుక్రవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయగానసభలో శతాబ్ది దాటిన మహనీయులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటుకూరి కృష్ణమూర్తి, ఏటుకూరి కృష్ణ బ్రహ్మానందంకు ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం తిరుపతి వెంకటకవులు రచించిన పౌరాణిక పద్యనాటకం శ్రీకృష్ణ రాయభారాన్ని కళాకారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏటుకూరి చంద్రకిషోర్, స్రవంతి, ప్రముఖులు పూర్ణచందర్‌రావు రవీంద్ర, వేంకటేశ్వర్‌రావు, లక్ష్మీనాయరాయణ, మాధవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బి.ఎస్ రాములు, సంధ్య తదితరులు



'మల్లెల తీర్థం మహా ఖననం'

కవాడిగూడ: ఎన్‌టీఆర్ స్టేడియంలో జరుగుతున్న హైదరాబాద్ 37వ జాతీయ పుస్తక ప్రదర్శనలో శుక్రవారం మల్లెల తీర్థం మహా ఖననం పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, పీవో డబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, బుక్ ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు. బీఎస్ రాములు మాట్లాడుతూ... పుస్తక రచయిత తెలంగాణ భాషను అద్భుతంగా వ్యక్తపరిచారని అన్నారు. సంధ్య మాట్లాడుతూ... ఈ పుస్తం ముఖచిత్రంలోనే ఎన్నో భావ విస్ఫోటనాలు కనిపిస్తున్నాయని అన్నారు. రచయిత సృష్టించే కవిత్వం అంతా ప్రజలకోసమేనని తెలిపారు. పుస్తక రచయిత సిద్ధార్థా మాట్లాడుతూ.. బుక్‌ఫెయిర్ వేదికగా ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, కె. ఆదిత్య, అంబటి సురేంద్రరాజు తదితరులు

కవిత్వాలు రాయకపోతే సమాజానికి నష్టం

కవాడిగూడ: అట్టడుగు వర్గాల వారు కవిత్వాన్ని రాయకపోతే సమాజానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ. కాశీం పేర్కొన్నారు. బుక్ ఫెయిర్ డాక్టర్ సంధ్య విప్లవ్ రచించిన ''అరుణిమ'', కోయి కోటేశ్వర్‌రావు రచించిన నాగస్వరం కవితల పంపుటిల పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, ప్రొఫెసర్ కాశీం, వీక్షణం సంపాదకులు ఎస్.వేణుగోపాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొ. కాశీం మాట్లాడుతూ... ఒక స్త్రీ కలం పట్టడం, స్త్రీల జీవితాలపై కవిత్వాలు రాయడం అంటే సాధారణ విషయం కాదన్నారు. వీక్షణం సంపాదకులు ఎన్ వేణుగోపాల్ మాట్లాడుతూ... వరంగల్ నేపథ్యంలో 70, 80 ఏళ్ల సామాజిక చరిత్రగా సాగిన కథ ఇది అని అన్నారు. వెనుకబడిన గిరిజన కుటుంబంలో జన్మించి ఉన్నత ఉద్యోగిగా ఎదిగిన మహిళ కథ అని పేర్కొన్నారు. బీఎస్ రాములు మాట్లాడుతూ... ఈ పుస్తకం ఉద్యమ కాలం నాటి రోజులను గుర్తు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కోయి కోటేశ్వర్‌రావు, బంగ్యానాయక్, బండారు విజయ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి యాకూబ్, జూలూరి గౌరీశంకర్ తదితరులు

'చరిత్ర సగం రాసిన వాక్యం'

సాక్షి, సిటీబ్యూరో: చరిత్ర సగం రాసిన వాక్యం అని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బుక్ ఫెయిర్లో సీనియర్ జర్నలిస్ట్ పీవీ రావు రాసిన 'వ్యాసాల సంకలనం.. వార్తలు సమాప్తం.. లోపలి కథ మొదలు'పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. గౌరీశంకర్ మాట్లాడుతూ... మల్లన్నసాగర్ రైతుల పక్షం నిలిచినట్లుగానే లగచర్ల అంశం పట్ల స్పందించాలన్నారు. జర్నలిస్టుల వాఖ్యాలకు పదును ఉంటుందన్నారు. సామాజిక చింతన ఉన్న వారే గొప్ప జర్నలిస్టులు అవుతారని చెప్పారు. రచయిత పీవీ రావు మాట్లాడుతూ... తనను కదిలించిన సంఘటనలే రాశానని చెప్పారు. కవి, జర్నలిస్ట్ ప్రసేన్ అధ్యక్షత వహించిన సభలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మిమిక్రీ ఆర్టిస్ట్ రమేష్, సింగరేణి మాజీ డైరక్టర్ డిఎల్ ఆర్ ప్రసాద్, కొండపల్లి పవన్, తెలంగాణ పబ్లికేషన్స్ నిర్వాహకులు కోయ చంద్రమోహన్, కవి తంగిరాల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ



పడిపూజలో రాజ్యసభ ఎంపీ డా. కె.లక్ష్మణ్, కార్పొరేటర్ జి.రచనశ్రీ

కవాడిగూడ: దోమలగూడ బండానగర్‌లో ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు చిత్రకుమార్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం 28వ మహా పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పమాలాధారులు అధిక సంఖ్యలో పాల్గొని భజనలు చేశారు. అయ్యప్ప భక్తిగీతాలతో బండానగర్ పరిసరాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం అయ్యప్పస్వాములకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మహా పడిపూజకు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ ముఖ్యఅతిథులుగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూజరాజు, ఎం.రమేష్‌రాం, జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, రంగరాజుగౌడ్, ఎంసీ మహేందర్‌బాబు, ఏ.ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, సలంద్రి దిలీప్‌యాదవ్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రకుల రాజకీయ పార్టీల కుట్రలను తిప్పికొట్టాలి

ముషీరాబాద్: బీసీల హక్కులను కాలరాస్తున్న అగ్రకుల రాజకీయ పార్టీల రాజకీయ కుట్రలను ప్రజలకు తెలియజేసి రాజకీయ చైతన్యం నింపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలోని కేంద్రంలో బీసీ చైతన్య సదస్సులు నిర్వహించి అగ్రకుల రాజకీయ కుట్రలను ప్రజలకు తెలియజేసి రాజకీయ చైతన్యం కల్పించాలన్నారు.

◆ అగ్రకుల రాజకీయ పార్టీలు బీసీలను రాజకీయంగా అణచివేస్తూ బీసీల హక్కులను కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని జనరల్ స్థానాలలో బీసీలు బరిలో నిలిచేలా అభ్యర్థులను సంసిద్ధం చేయాలన్నారు. చట్టసభల్లో బీసీలు అధిక సంఖ్యలో అడుగుపెట్టేలా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య, వెంకటేష్‌యాదవ్, గొడుగు నర్సింహులు, బాలయ్య, రాగ్యరమేష్, ఆశిష్‌గౌడ్, టింకు తదితరులు పాల్గొన్నారు.



బీసీ జాగృతి సేవ నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

రజకుల అభివృద్ధికి పాటుపడిన మహోన్నతుడు డా.అంజయ్య



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: రజకుల అభివృద్ధి కోసం అహర్నిషలు, నిరంతరం పాటుపడిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఎం. అంజయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. రజకుల సమగ్ర అభివృద్ధి సాధించడమే అంజయ్యకు నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీషిరిడీ సాయిబాబా దేవాలయం వద్ద ఉన్న రజకాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఎం.అంజయ్య 3వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, తెలంగాణ రజక అభివృద్ధి (దోభీ) సంస్థ అధ్యక్షుడు బొమ్మరాజు కృష్ణమూర్తి తదితరులు హాజరై ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... డాక్టర్ ఎం. అంజయ్య ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఆయన చేసిన సేవలు రజకులు ఎప్పటికీ మరచిపోరన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్‌చైర్మన్ మందలపు గాంధీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. నర్సింహ, ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, రజక సంఘం నాయకులు కొండమీది హరినాథ్, ఏపీ రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నాడ మోహన్ రావు, చుక్కన్న, యాదగిరి, బి.చంద్రమోహన్, పి.కిషన్, సుధాకర్, సత్యనారాయణతో పాటు అంజయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు

డాక్టర్ చిక్కా దేవదాసు



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్. చిక్కా దేవదాసు అన్నారు. మన దేశం గొప్ప రాజనీతి శాస్త్రవేత్తను కోల్పోయిందన్నారు. మన్మోహన్‌సింగ్ హయాంలోనే తెలంగాణ ఏర్పడిందన్నారు. తెలంగాణ బిల్లు ఆమోదంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల 60ఏళ్ల కలను సకారం చేసిన ఘణత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రపంచం గర్వించదగ్గ వ్యక్తి, మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. ప్రధానిగా ఎన్నో సంస్కరణలు చేపట్టి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారని అన్నారు. ఆర్‌బీఐ గవర్నర్‌గా, యూజీసీ చైర్మన్‌గా, ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్‌గా ఉండి అనేక సేవలు అందించారని గుర్తు చేశారు.

రేపు మున్నూరుకాపు వివాహ పరిచయ వేదిక

కాచిగూడ: వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకుని సరైన జీవిత భాగస్వామిని ఎంచుకోవాలని తెలంగాణ మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు అన్నారు. శుక్రవారం కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివాహ పరిచయ వేదిక చైర్మన్ గోపాల రాధకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 29వ తేదీన ఉదయం 10గంటలకు కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్యహాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్ నం.93903 54580, 99631 66363లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రమేష్‌కుమార్, వినోద్‌కుమార్, హనుమంతరావు, సురేష్‌బాబు, జితేందర్, కొమ్ము శ్రీనివాస్, బొశెట్టి దయానంద్, అనంతుల ప్రహ్లాద్, మంగు ఆనంద్ పాల్గొన్నారు.

జలమండలి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లండి

కాచిగూడ: జలమండలి ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డికి శుక్రవారం జలమండలి కాంగార్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి వినతిపత్రం అందజేశారు. జలమండలి కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. వేతనాల పెంపుదల, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ, ఉద్యోగుల ప్రమోషన్‌లు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. జలమండలి ఉద్యోగులందరికీ ఉచిత హెల్త్‌కార్డులు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, చక్రధర్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సలహాదారుడికి వినతిపత్రం అందజేస్తున్న రాజిరెడ్డి, బొంతు రామ్మోహన్

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



నారాయణగూడలో పద్మశాలి మహిళా విభాగం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ

కాచిగూడ: మహిళలు ఏదో ఒకరంగంలో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలని, మహిళలు ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం బాగుటుందని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్ అధ్యక్షతన శుక్రవారం నారాయణగూడ పద్మశాలి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. మహిళలు రాజకీయంగా రాణించాలని, రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఈరవత్రి అనిల్, గడ్డం జగన్నాథం, బర్రెంకల మధుసూదన్, వనం దుశ్యంతల, కమర్తపు మురళి, పుట్ట పాండురంగయ్య, స్వప్నరాజ్, కందగట్ల శోభ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్కాలర్‌షిప్ రూ.20వేలకు పెంచాలి



కాచిగూడ అభినందన్ లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ: విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు రూ.20వేలకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడ అభినందన్‌లో బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజుల బకాయిలు చెల్లించకుండా ఏళ్ల తరబడి జాప్యం చేస్తోందన్నారు. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.4వేల కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. ఇంటర్ మీడియట్ కోర్సులు చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1800 నుంచి రూ.15వేలకు పెంచాలని కోరారు. విదేశీ విద్య చదివే విద్యార్థులందరికి రూ.20లక్షల స్టైఫండ్ మంజూరు చేయాలని అన్నారు. బీసీ కాలేజీ హాస్టళ్లకు, గురుకుల పాఠశాలలకు స్వంత భవనాలు నిర్మించాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను నైజ200 కోట్లకు పెంచాలన్నారు. అన్ని ఉద్యోగ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తూనే నెలకు రూ.5వేల స్టైఫండ్ ఇవ్వాలన్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్

చిక్కడపల్లి: భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో శుక్రవారం సీఐటీయూ గ్రేటర్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి మాట్లాడారు. అంబేద్కర్‌తో పాటు కార్మికులపై సైతం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వాఖ్యాలు చేస్తున్నారని అన్నారు. అందుకే జిల్లాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చామని అన్నారు. సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ.. భారత పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాతకు అవమానం జరిగిందన్నారు. హోంమంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, నగర నాయకులు సి.మల్లేష్, డీఎల్ మోహన్, జి.రాములు, ఎం.సత్యనారాయణ, మహేందర్, మల్లయ్య, జగదీశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో నిరసన తెలుపుతున్న సీఐటీయూ గ్రేటర్ కమిటీ నాయకులు



దేశ ఆర్థిక చరిత్రనే మలుపు తిప్పిన నేత

మాజీ ప్రధాని డా. మన్మోహన్‌సింగ్

మాజీ ప్రధానమంత్రి డా. మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటని వివిధ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. శుక్రవారం పలు కూడళ్లలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలతో దేశ భవిష్యత్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా, ఆర్థికమంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ సలహాదారుగా, ఆర్థిక శాఖ ప్రధాన సలహాదారుగా, ఆర్‌బీఐ గవర్నర్‌గా పలు బాధ్యతలు నిర్వర్తించి ఆ పదవికే వెన్నె తెచ్చారని అన్నారు. దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన ప్రధానుల్లో ఆయన ఒకరని కొనియాడారు. దేశ ఆర్థిక చరిత్రనే మలుపు తిప్పిన నాయకుడన్నారు. చరిత్రాత్మకమైన ఎన్నో పథకాలు మన్మోహన్‌సింగ్ హయాంలోనే రూపుదిద్దుకున్నాయని గుర్తు చేసుకున్నారు. దేశంలో ఆధార్ కార్డు, ఆర్‌టీఐ చట్టం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర బిల్లు, ఉపాధి హామీ పథకం వంటి సంస్కరణలు ఆయన హయాంలోనే జరిగాయని అన్నారు. భారత దేశానికి ఆయన చేసిన సేవలకు భారత ప్రభుత్వం ఆయనకు పద్మ విభూషణ్ పురస్కారంతో సత్కరించిందని అన్నారు.

– అంబర్‌పేట/ముషీరాబద్ జోన్ బృందం



అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పి.పద్మజ, సిబ్బంది





